సాక్షి
ప్రకాశం
మంగళవారం । 7 । ఫిబ్రవరి । 2023



పెద్దాస్పత్రిలో పర్యవేక్షణ కరువు

ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో అధికారుల పర్యవేక్షణ కరువైంది. ఓ వృద్ధుడి మృతదేహం గంటల తరబడి రిమ్స్ ఆవరణలో ఉన్నా పట్టించుకోలేదు.

- 8లో..



ఉద్యోగాల పేరుతో టోకరా

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఒంగోలుకు చెందిన ఓ వ్యక్తి రూ.17.90 లక్షలు వసూలు చేశాడని బాధితులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
31 /20

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం.

న్యూస్‌రీల్

బాలుడికి అందుతున్న చేయూత

సాక్షి ఎఫెక్ట్..

ఉలవపాడు: అనారోగ్యంతో బాధపడుతూ వైద్యశాలలో చికిత్స పొందుతున్న రెండేళ్ల బాలుడికి దాతలు ఆర్థిక సాయం అందజేస్తున్నారు. ఉలవపాడు వరిగిచేను సంఘానికి చెందిన మానికల యశ్వంత్ అభిరామ్‌కు ఊపిరితిత్తులు, గుండె మధ్య చీము గడ్డలు ఆపరేషన్ చేసి తీయడానికి రూ.6 లక్షలు అవసరం అవడంతో 'సాక్షి'లో 'ఆయుష్షు పోయండి'పేరుతో కథనం ప్రచురించారు. దీనికి దాతలు స్పందించి సోమవారం సాయంత్రం 6 గంటలలోపు రూ.41 వేలు వారి తమ్ముడు అశోక్ బ్యాంకు ఖాతాలో జమచేశారు. కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి వారికి సీయం సహాయనిధి నుంచి ఆర్థిక సాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఆరోగ్య శ్రీ ట్రస్టు తరఫున ఉలవపాడు సీహెచ్‌సీ వైద్యాధికారి సతీష్ బాబు బాలుడి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. విజయవాడలోని వైద్యశాల వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఆరోగ్య శ్రీ లో ఈ ఆపరేషన్ లేదని అక్కడి వైద్యులు సతీష్ బాబుకు తెలిపారు. తమ వంతుగా కూడా సాయం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్‌లో ముస్కాన్‌కు సిల్వర్ మెడల్



ముస్కాన్‌ను అభినందిస్తున్న నాజీర్ అహమ్మద్

మార్కాపురం: మార్కాపురానికి చెందిన ఎస్కే ముస్కాన్ నేపాల్‌లోని కాట్మాన్ నేషనల్ స్టేడియంలో సౌత్‌ఏషియన్ చాంపియన్‌షిప్ స్పైక్ మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో అంతర్జాతీయ స్థాయిలో సిల్వర్ మెడల్ సాధించిందని మార్షల్ ఆర్ట్స్ నిర్వాహకులు యం.శ్రీనివాసరెడ్డి, తోట ప్రసాద్ తెలిపారు. ఈ పోటీలు ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు నేపాల్‌లో జరిగాయి. మన దేశం తరఫున అండర్ 14 గరల్స్ కటా విభాగంలో అంతర్జాతీయ స్థాయిలో ముస్కాన్ సిల్వర్ మెడల్ సాధించిందని తెలిపారు. ముస్కాన్‌ను పలువురు అభినందించారు. ఆమెను గ్రాండ్ మాస్టర్ నాజీర్ అహమ్మద్ పతకం ఇచ్చి సన్మానించారు.

ముగిసిన కబడ్డీ పోటీలు



విజేత జట్టుకు ట్రోఫీ బహూకరిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి

ఒంగోలు: స్థానిక డీఆర్ఆర్ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో జరిగిన కబడ్డీ ఫైనల్స్ పోటీలు సోమవారం రాత్రి ముగిశాయి. భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో జరుగుతున్న మోడీ కబడ్డీ టోర్నమెంట్‌కు ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి 24 జట్లు పాల్గొన్నాయి. జూనియర్స్ బాలుర విభాగంలో 12 జట్లు, సీనియర్స్ బాలుర విభాగంలో 6 జట్లు, బాలికల విభాగంలో 6 జట్లు పాల్గొన్నాయి. బీజేవైఎం అధ్యక్షుడు కె.విష్ణువర్ధన్‌రెడ్డి, బీఎంఆర్ శంకర్, బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పులి వెంకట కృష్ణారెడ్డి, ఈదర హరిబాబు, శిద్దా వెంకటేశ్వరరావు, కొమ్మి నరశింగరావు పాల్గొని విజేత జట్లకు నగదు బహుమతులు అందించారు.

పల్లె వాకిట జలసవ్వడి



సింగరాయకొండ మండలం జంగిన పల్లి గ్రామంలో కుంట నిర్మాణ పనులు

గ్రామాల్లో తాగు, సాగు నీటి అవసరాలను తగ్గట్టు విశాలమైన నీటికుంటలు నిర్మించాలి. ఒక వైపు భూగర్భ జలాలు పెంచుకుంటూనే మరో వైపు పల్లెల్లో జలజీవం పోయాలి.. ఇదే లక్ష్యంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా 'మిషన్ అమృత్ సరోవర్' ప్రాజెక్టు కింద జిల్లాలో చేపట్టిన పనులు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే 71 కుంటల నిర్మాణం పూర్తి చేయగా మరో 50 కుంటల పనులు చకచకా జరుగుతున్నాయి.

- జిల్లాలో వడివడిగా "అమృత్ సరోవర్" పథకం అమలు
- జిల్లా వ్యాప్తంగా 328 కుంటల ఏర్పాటుకు ప్రణాళికలు
- తొలి విడతగా 71 పూర్తి
- రెండో దశలో మరో 50 నిర్మాణానికి జోరుగా పనులు
- ఆగస్టు 15 నాటికి 125 కుంటల పూర్తికి చర్యలు
- ఇప్పటికే లక్ష్యానికి మించి పనులు
- కుంటల చుట్టూ సుందర వనాలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: 'మిషన్ అమృత్ సరోవర్' ప్రాజెక్టు కింద జిల్లా వ్యాప్తంగా 328 కుంటలు తవ్వేందుకు ప్రాంతాలను గుర్తించారు. తొలివిడతగా జిల్లాకు 75 కుంటలు లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటికే 71 కుంటల నిర్మాణం పూర్తయింది. ఒక్కో కుంట ఒక ఎకరం విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. ఒంగోలు మండలం మినహా మిగతా 37 మండలాల్లో ఈ పథకం కింద కేటాయించారు. ఒక్కో మండలంలో ఒకటి, అంతకంటే ఎక్కువగా చేపట్టేందుకు నిర్ణయించారు. ఆయా మండలాల్లోని గ్రామాల్లో పరిస్థితులు, అవసరాలకు అనుగుణంగా కుంటల నిర్మాణానికి సర్వే చేసి ఎక్కడ అవసరం అవుతుందో అక్కడ తవ్వేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇప్పటి వరకూ పూర్తైన 71 కుంటల చుట్టూ కట్టలు ఏర్పాటు చేసి వాటిపై మొక్కలు నాటి సుందరంగా తీర్చిదిద్దనున్నారు. రెండో విడతగా మరో 50 కుంటలు అదనంగా లక్ష్యంగా పనులు జరుగుతున్నాయి. రెండు విడతలుగా 125 కుంటలను లక్ష్యంగా పనులు చేపట్టారు. ప్రస్తుతం సర్వే చేసిన వాటిలో అత్యధికంగా కొండపి అసెంబ్లీ నియోజకవర్గంలోని మర్రిపూడి మండలంలో 29 ట్యాంకులను గుర్తించారు. అత్యల్పంగా టంగుటూరు, పుల్లలచెరువు మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున మాత్రమే తవ్వనున్నారు. వీటి ద్వారా వచ్చే నీటిని పంటలు పండించుకోవటానికి వినియోగించుకోవచ్చు. తాగునీటి అవసరాలకు తగ్గట్టుగా కూడా కుంటను తీర్చిదిద్దుకోవచ్చు. పశువుల తాగునీటి అవసరాలూ తీర్చుకోవచ్చు.

గ్రామంలో ప్రముఖులకు గౌరవాన్ని ఇచ్చేలా..

పనుల ప్రారంభం నుంచి కుంటల వద్ద జెండా వందనం వరకూ స్థానికంగా ప్రముఖులకు అవకాశం కల్పిస్తున్నారు. ఆయా గ్రామాల్లో అందరికంటే ఎక్కువ వయస్సు ఉన్న వ్యక్తి చేత పనులకు శంకుస్థాపన చేయిస్తారు. అలాగే 75 సంవత్సరాలు దాటి ఉండాలి. మహిళ అయినా పురుషుడు అయినా ఎవరైనా సరే. అలాగే స్వాతంత్ర్య సమరయోధులు ఉంటే వారి చేత చేయించాలి. వారి కుటుంబ సభ్యులు ఎవరైనా పెద్దవారు ఉన్నా సరే వారిచేత అయినా చేయించాలి. లేకుంటే అమర వీరుల కుటుంబ సభ్యులచేత అయినా చేయించాలి. ఆగస్టు 15వ తేదీన ఆ ట్యాంకు వద్ద జెండా వందనం చేయటానికి కూడా ఏర్పాట్లు చేయాలి. ఆ జెండా వందనాన్ని కూడా పైన పేర్కొన్న వర్గాలకు చెందిన వారిచేతనే జాతీయ జెండాను ఎగురవేయించాలి.

ముమ్మరంగా ఉపాధి అవకాశాలు...

గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద అమృత్ సరోవర్ పనులు చేస్తున్నారు. ఫలితంగా జిల్లాలోని ఉపాధి కూలీలకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కలుగుతున్నాయి. ఒక్కో కుంటలో 10 వేల క్యూబిక్ మీటర్ల మేర నీరు నిల్వ చేయగలిగేలా తవ్వకాలు చేస్తున్నారు. నిర్మాణ పనులు పర్యవేక్షించేందుకు ప్రతి గ్రామంలో ఇద్దరు ప్రతినిధులను కేటాయిస్తున్నారు. వారు అధికారులు, లేకుంటే ప్రజా ప్రతినిధులు అయినా కావచ్చు. నూతనంగా తవ్వుతున్న ట్యాంకుకు సంబంధించిన పూర్తి వివరాలను కేంద్ర ప్రభుత్వం రూపొందించిన అమృత్ సరోవర్ యాప్‌లో నమోదు చేయాలి. ఈ ఏడాది ఆగస్టు 15వ తేదీ నాటికి 125 పూర్తి చేయాలని నిర్ణయించారు. అయితే ఇప్పటికే జిల్లా యంత్రాంగం లక్ష్యాన్ని దాటి నాలుగు రెట్లు అధికంగానే పూర్తి చేసింది.



నాగులుప్పలపాడులో పనులను ప్రారంభిస్తున్న డ్వామా పీడీ సీనారెడ్డి (ఫైల్)

నగరంలో వేగంగా అభివృద్ధి పనులు




31వ డివిజన్ మామిడిపాలెంలో గడపకు గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ తిరుగుతూ మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి

- మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ముందుకు..
- 31వ డివిజన్ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. ఒంగోలు నగరంలో సోమవారం 31వ డివిజన్ పరిధిలో మామిడిపాలెంలో కార్పొరేటర్ తన్నీరు నాగజ్యోతి నాగేశ్వరరావుతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బాలినేని నిర్వహించారు. గతంలో ఎప్పుడూ జరగని విధంగా నగరంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా అధికారులను పరుగులు తీయిస్తున్నానని బాలినేని పేర్కొన్నారు. నగరంలోని శివారు ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని వెల్లడించారు. మామిడిపాలెంలో ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన తీరును బాలినేని స్వయంగా అడిగి తెలుసుకుంటున్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేపట్టని విధంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు స్థానికులకు వివరిస్తున్నారు. మామిడిపాలెంలోని కృష్ణుడి దేవాలయంలో ప్రత్యేకంగా పూజలు చేశారు. మామిడిపాలెంలో రూ.6 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డు, సీసీ డ్రెయిన్‌ను బాలినేని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ మేయర్‌లు వేమూరి సూర్యనారాయణ, వెలనాటి మాధవరావు, పార్టీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు కఠారి శంకర్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గంటా రామానాయుడు, ఏపీఐఐసీ కార్పొరేషన్ సభ్యులు ముప్వా స్వాతి, కార్పొరేటర్లు యనమల నాగరాజు, ఈదర చిన్నారి, గోపీ చంద్, జడా వెంకట్, తాడి కృష్ణలత, ఆదిపూడి గిరిజా శంకర శాండిల్య, నాగం వెంకట శేషయ్య, గోపిరెడ్డి గోపాల రెడ్డి, గోలి లక్ష్మీ కోటేశ్వరమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు పుచ్చకాయల గోవర్ధన్ రెడ్డి, జాజుల కృష్ణ, జిల్లెళ్ళమూడి రమాదేవి, గుర్రం వెంకయ్య, వల్లెపు మురళి, దాసరి కరుణాకర్, బొప్పరాజు జ్యోతి, గొర్రెపాటి శ్రీనివాసులు, మైనారిటీ బహబూబ్ బాష, పసుపులేటి శ్రీనివాసులు, విస్సు, మోదుబోయిన సురేష్, తమ్మినేని మాధవి, పోతంశెట్టి వెంకటరత్నం, బొమ్మినేని మురళి, తూము పద్మ, బైరెడ్డి అరుణ, బేదపూడి రాజేశ్వరి, చింతగుంట్ల సువర్ణ, చిట్టిబోయిన రమణమ్మ, మరియమ్మ, సాదం విజయలక్ష్మి, అక్కిరెడ్డి, గోలి తిరుపతి రావు, దేవరపల్లి అంజిరెడ్డి, తూము వెంకట్రావు, నజీరు, మీరావలి, 31వ డివిజన్ నాయకులు మిడసల మధు బాబు, గుంజి ఏడుకొండలు, బండారు శ్రీరాములు, కొమ్ము రవి, బండారు మల్లిఖార్జునరావు, విసు, బడుగు ఇందిర, కొమ్మూరి రవిచంద్ర, కొమ్ము రాజీవ్, దాసు, విజయ, కుమారు, కట్టా రాజు, రమాకృష్ణతో పాటు పలువురు పాల్గొన్నారు.

15 రోజుల్లో బకింగ్ హామ్ బ్రిడ్జి ప్రారంభం

- 60 శాతం పనులు పూర్తి చేయించాం
- రూ.9.28 కోట్ల పనులు చేశాం
- కాంట్రాక్టర్ పెట్టలేనన్నా మేమే పనిని పూర్తి చేయిస్తున్నాం
- ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి, మేయర్ గంగాడ సుజాత తదితరులు

కొత్తపట్నం: మరో పదిహేను రోజుల్లో బకింగ్ హామ్ బ్రిడ్జిని ప్రారంభించి వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చేస్తామని ఒంగోలు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి భరోసా ఇచ్చారు. పనులు జరుగుతున్న బకింగ్‌హామ్ బ్రిడ్జిని సోమవారం పరిశీలించారు. ఆర్ అండ్‌బీ ఎస్సీ కోలా విజయ్‌వర్మతో మాట్లాడుతూ ఎన్ని రోజుల్లో పూర్తి చేస్తారు, ఏ పనులు ఉన్నాయి తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. 25 ఎంఎం మెటల్ వేయాల్సి ఉందని, 15 రోజుల్లో పూర్తి చేస్తామని, ఇప్పటికే రెండు లేయర్లు 25 ఎంఎం మెటల్ వేశామన్నారు. అది పూర్తయిన తరువాత ప్రారంభించవచ్చన్నారు. ఈ సందర్భంగా బాలినేని విలేకర్లతో మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చిన తరువాత 60 శాతం బ్రిడ్జి పనులు పూర్తి చేశామన్నారు. 2019 ముందు అంటే టీడీపీ ప్రభుత్వంలో నాలుగేళ్లలో రూ.8.41 కోట్ల నిధులు ఖర్చు చేసి కేవలం 40 శాతం పనులు చేస్తే...దానిని మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు 80 శాతం చేశామని అబద్ధాలు చెప్పుకోవటం సిగ్గుచేటని మండిపడ్డారు. బ్రిడ్జి కాంట్రాక్టర్ జనార్ధన్‌రావు చెప్పినట్లు పనులు ఆపడం ఇబ్బందులు కలిగించడం మంచి పద్ధతి కాదన్నారు. మెటీరియల్ ఇవ్వటానికి వ్యాపారులతో మాట్లాడి సహాయం చేస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత రూ.9.28 కోట్ల పనులు పూర్తి చేశామని చెప్పారు. కరోనా వల్ల బ్రిడ్జి పనులకు ఆటంకం కలిగిందని.. ఎన్ని ఇబ్బందులు వచ్చినా బ్రిడ్జిని ప్రారంభానికి తీసుకొస్తున్నామన్నారు. వాస్తవంగా కేంద్రం నుంచి 75 శాతం, రాష్ట్రం 25 శాతం నిధులతో బ్రిడ్జి పనులు జరగాల్సి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం వర్కును రద్దు చేస్తే జనార్ధన్ మా మీద రుద్దడం, మా మీద అబద్ధాలు చెప్పడం మంచి పద్ధతి కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బకింగ్‌హామ్ బ్రిడ్జి 2018 నాటికే పూర్తి కావాలి: ఆర్‌అండ్‌బీ ఎస్సీ విజయ్ మాట్లాడుతూ బకింగ్‌హామ్ బ్రిడ్జి 2016లో ప్రారంభమైందని..2018లోనే పూర్తి చేయాలని అగ్రిమెంట్ అయ్యిందన్నారు. 2019 నాటికి రూ.8.41 కోట్ల పనులు పూర్తి చేశారని చెప్పారు. ఎన్‌సీఆర్ఎంపీ ద్వారా మొదటిగా రూ.14 కోట్లు మంజూరయ్యాయన్నారు. బ్రిడ్జి ప్లాన్ మార్చడం వలన దానిని రూ.20.57 కోట్లకు పెంచారని చెప్పారు. 2019 నాటికి రూ.8.41 కోట్ల పనులు అంటే 40 శాతం పనులు మాత్రమే జరిగాయన్నారు. 2019 తరువాత రూ.9.28 కోట్ల పనులు పూర్తి చేశారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఎన్‌సీఆర్ఎంపీ స్కీమ్ క్లోజ్ చేసిందని.. మిగతా మొత్తం రాష్ట్ర ప్రభుత్వం పెట్టుకోవాల్సి ఉంటుందన్నారు. మా ఈఎమ్‌సీ ఆఫీసర్ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌కు, గవర్నమెంట్‌కు రాశారని..దీనిని బాలినేని శ్రీనివాసరెడ్డి పరిశీలిస్తున్నారన్నారు. ఆ నిధులు వచ్చే అవకాశం ఉందన్నారు. బాలినేని వెంట మేయర్ గంగాడ సుజాత, కొత్తపట్నం, రూరల్ ఎంపీపీలు లంక పోతు అంజిరెడ్డి, పల్లప్రోలు మల్లిఖార్జున్‌రెడ్డి, జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు సైకం లక్ష్మీశారద, తహసీల్దార్ రమణారావు, ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా వైద్యశాలకు అత్యాధునిక వైద్య పరికరాలు



ఎలీసా మిషన్



బయోకెమిస్ట్రీ ఆటోమెటిక్ మిషన్ గురించి వివరిస్తున్న డాక్టర్ సాయి కిరణ్

- రూ.28 లక్షలతో ఏర్పాటు

మార్కాపురం: మార్కాపురంలోని జిల్లా వైద్యశాలకు వైద్యారోగ్యశాఖ దాదాపు రూ.28 లక్షల వ్యయంతో టెస్టింగ్ వైద్య పరికరాలు పంపించడంతో వాటితో రోగులకు సేవలందిస్తున్నారు. ప్రధానంగా రూ.20 లక్షల వ్యయంతో బయోకెమిస్ట్రీ ఆటోమెటిక్ మిషన్ ల్యాబ్‌లో ఏర్పాటు చేశారు. దీని ద్వారా మనిషి శరీరంలో గ్లూకోస్ స్థాయి, కిడ్నీ, లివర్ ఫంక్షనింగ్, షుగర్ లెవెల్స్ కేవలం 15 నిమిషాల వ్యవధిలో తెలుసుకోవచ్చు. ఖచ్చితమైన సమాచారం వస్తుందని డాక్టర్ చాగంటి సాయి కిరణ్ తెలిపారు. రూ.3 లక్షల వ్యయంతో ఎలీసా మిషన్‌ను బిగించినట్లు వైద్యశాఖ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బారెడ్డి చెప్పారు. ప్రధానంగా డెంగీ ఫివర్ నిర్ధారణను ఈ మిషన్ ద్వారా వెంటనే తెలుసుకోవచ్చన్నారు. రోగులెవరైనా ఈ టెస్ట్‌ల కోసం వస్తే ఇప్పటి వరకు ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటి నుంచి జిల్లా వైద్యశాలలోనే డెంగీ టెస్ట్ చేస్తామన్నారు. సుమారు రూ.2 లక్షల వ్యయంతో ఎలక్ట్రో లైట్ మిషన్ ఏర్పాటు చేశామని వ్యక్తి శరీరంలోని సోడియం, పొటాషియం లెవెల్స్ తెలుసుకోవచ్చని గుండె జబ్బుల నిర్ధారణ కూడా చేయవచ్చన్నారు. రూ.3 లక్షల వ్యయంతో సీబీసీ మిషన్ కూడా బిగించామని దీని ద్వారా పూర్తి స్థాయిలో రక్త పరీక్షలు, రక్త కణాల స్థాయి కూడా పరీక్షించవచ్చని చెప్పారు. పశ్చిమ ప్రకాశం ప్రజలు జిల్లా వైద్యశాలలోని అధునాతన వైద్య సేవలు పొందవచ్చని డాక్టర్ సుబ్బారెడ్డి తెలిపారు.

స్పందన సమస్యలు సత్వరమే పరిష్కరించాలి



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

- ఉద్యోగులకు ముఖ హాజరు తప్పనిసరి
- కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన సమస్యలను సత్వరమే క్షేత్ర స్థాయిలో పరిష్కరించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్పందన భవనంలో స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తొలుత డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం నిర్వహించి ఫోన్ ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో సమస్యల పరిష్కారం పట్ల ప్రజల సంతృప్తి పెరగాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు అందరూ తప్పనిసరిగా ముఖ ఆధారిత హాజరు కచ్చితంగా వేయాలన్నారు. ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ చేసుకొని ఉద్యోగులు అందరూ రెండు రోజుల్లో చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ చేయకుంటే కారణాలు తెలపాలన్నారు. దీనిపై డీఆర్‌ఓ, సీపీఓలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. స్పందన అర్జీలు రీ ఓపెన్ కాకుండా సహేతుకంగా పరిష్కరించాలన్నారు. మండల, డివిజన్ స్థాయిలో ప్రజా సమస్యలు పరిష్కారం అయితే జిల్లా స్పందనలో ఒత్తిడి తగ్గుతుందన్నారు. స్పందనలో డీఆర్‌ఓ ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సరళావందనం, గ్లోరియా, ఉమాదేవి, చెన్నయ్య ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. స్పందన కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 15 మంది బధిరులకు సామ్‌సంగ్ టచ్‌ఫోన్‌లు కలెక్టర్ అందజేశారు. ఒక్కో ఫోన్ రూ.15 వేలు ఉంటుందని మొత్తం రూ.2.25 లక్షలు విలువని అధికారి అర్చన తెలిపారు.

ఆపదమిత్ర కిట్లు పంపిణీ



వలంటీర్లకు కిట్లు అందజేస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు అర్బన్: విపత్తుల సమయంలో అత్యవసర సేవలందించేందుకు ప్రత్యేక శిక్షణ పొందిన 300 మంది వలంటీర్లకు ఆపదమిత్ర కిట్లను కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సోమవారం స్పందన భవనం వద్ద పంపిణీ చేశారు. కిట్‌లో లైఫ్ జాకెట్, టార్చిలైట్‌తో పాటు పలు వస్తువులతో కూడి బ్యాగులను వలంటీర్లకు అందజేశారు. డీపీఓ నారాయణరెడ్డి, జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తమ్ముడి మరణవార్త విని అన్న మృతి



బీరెడ్డి చిన్న ఆల్లూరిరెడ్డి (ఫైల్)



బీరెడ్డి పెద్ద ఆల్లూరిరెడ్డి (ఫైల్)

పెద్దారవీడు: ఒకే కుటుంబంలో అన్నదమ్ములు గుండెపోటుకు గురై గంట వ్యవధిలో ఇద్దరూ మృతి చెందిన సంఘటన పెద్దారవీడు మండలంలో బద్వీడుచెర్లో పల్లె గ్రామంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం బీరెడ్డి చిన్న ఆల్లూరిరెడ్డి (65) ఇంటిలో కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సమయంలో హఠాత్తుగా కుప్పకూలిపోయాడు. వెంటనే 108 ఫోన్ చేయగా అంబులెన్స్ సిబ్బంది చికిత్స కోసం మార్కాపురం జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్ నిర్ధారించారు. మృతునికి భార్య లక్ష్మీ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. తమ్ముడి మరణ వార్త తెలిసిన గంట వ్యవధిలోనే ఆల్లూరిరెడ్డి అన్న బీరెడ్డి పెద్దాల్లూరిరెడ్డి (67) ఇంటిలోనే గుండెనొప్పి రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య తిరుపతమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అన్నదమ్ములు ఇద్దరూ అన్యోన్యంగా పక్క పక్క ఇళ్లలోనే నివాసం ఉంటూ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఒకే కుటుంబంలో ఇద్దరు అన్నదమ్ములు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి, ఎంపీపీ బెజవాడ పెద్దగురవయ్య, నాయకులు అల్లు వెంకటేశ్వరరెడ్డి, తదితరులు మృతునికి పూలమాల వేసి నివాళులర్పించారు.

క్లుప్తంగా

సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం ఇవ్వాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్ : జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ సుఖ ప్రసవాలు కచ్చితంగా చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ అధికారులకు సూచించారు. ఏరియా ఆస్పత్రిల్లో హైరిస్క్ ప్రసవాలు చేయాలన్నారు. పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, వైద్య విధాన పరిషత్ వైద్యాధికారులతో సోమవారం క్యాంపు కార్యాలయం నుంచి జూమ్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సేఫ్ డెలివరీ క్యాలెండర్ ద్వారా నమోదు చేసి ప్రతి రోజు క్యాలెండర్ ప్రకారం గర్భిణులను ప్రసవం కోసం ప్రోత్సహించాలన్నారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులను గుర్తించి వారికి అవసరమైన సేవలను అందించాలన్నారు. వైద్య సేవలందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కౌమార దశలో ఉన్న ఆడపిల్లలకు రక్తహీనత పరీక్షలు నిర్వహించాలన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు పిల్లలకు ఇవ్వాల్సిన అన్ని రకాల వ్యాధి నిరోధక టీకాలను ఇచ్చి వాటి వివరాలను ఎంసీపీ కార్డులో నమోదు చేయాలన్నారు. డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, డీసీహెచ్‌ఎస్ మూర్తి, అడిషనల్ డీఎంహెచ్‌ఓ సురేష్ బాబు ఇతర అధికారులు పాల్గొన్నారు.

విపత్తు నిర్వహణ శిక్షణకు జేసీ

ఒంగోలు అర్బన్: ముస్సోరిలోని లాల్‌బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌లో విపత్తు నిర్వహణపై మూడు రోజుల శిక్షణకు జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ హాజరయ్యారు. ఈ శిక్షణకు దేశ వ్యాప్తంగా 25 మంది ఐఏఎస్ అధికారులను ఎంపిక చేయగా వారిలో జేసీ అభిషిక్త్ కిషోర్ ఉండటం విశేషం.

పెద్దాసుపత్రిలో పర్యవేక్షణ కరువు

● పార్కింగ్ స్థలంలో శవం ఉన్నా.. గుర్తించని వైనం
● మృతదేహం ఉన్న విషయం తెలిసినా నిర్లక్ష్యం
● వందలాది మంది సిబ్బంది ఉన్నా ఎవ్వరికీ పట్టదు

ఒంగోలు అర్బన్: అన్నీ ఉన్నా అల్లుడు నోట్లో శని అన్నట్లు ఉంది ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి అధికారుల తీరు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్య సేవలిందించాలని పెద్దాసుపత్రిలో అన్ని సౌకర్యాలు కల్పించినా అధికారుల మెతకవైఖరి, ఆధిపత్య పోరుతో ఇబ్బందులు సృష్టిస్తున్నారు. సూపరింటెండెంట్ మెతక వైఖరితో కింది స్థాయి ఉద్యోగులు ఎవరి తీరు వారిదే అన్నట్లు విధులు నిర్వహిస్తున్నారు.



జీజీహెచ్ పార్కింగ్ స్థలంలో ఉన్న అనాథ మృతదేహం ఎవ్వరూ పట్టించుకోలేదు.

జీజీహెచ్ పార్కింగ్ ఆవరణలో నిత్యం రాత్రిళ్లు నిద్రించే వృద్ధుడు మరణించాడు. ప్రత్యక్షంగా చూసిన వారి మాటల ప్రకారం ఆదివారం నుంచి వృద్ధుడి శవం పార్కింగ్ స్థలంలో పడి ఉన్నా ఎవరూ పట్టించుకోలేదు. సోమవారం మధ్యాహ్నం వరకు ఆ మృతదేహాన్ని ఎవరూ తొలగించేందుకు చర్యలు తీసుకోలేదు. దీంతో మృతదేహంపై దోమలు, చీమలు కమ్ముకున్నాయి. మీడియా సూపరింటెండెంట్ దృష్టికి తీసుకువెళ్లే వరకు ఆయనకు తెలియలేదంటే జీజీహెచ్‌లో పర్యవేక్షణ ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మృతదేహం ఉన్న పార్కింగ్ ఆవరణలో వైద్యులు ఇతర సిబ్బంది, ప్రజల వాహనాలు నిరంతరం పార్కింగ్ చేస్తూనే ఉంటారు. అయినా ఎవరూ పట్టించుకోలేదంటే అక్కడి నిర్లక్ష్యం తేటతెల్లమవుతోంది. సిబ్బంది చూసినా ఎవ్వరూ కూడా పై అధికారులకు సమాచారం ఇవ్వలేదా..? ఇస్తే చర్యలు తీసుకోలేదా అనే చర్చలు జరుగుతున్నాయి. జీజీహెచ్ సూపరింటెండెంట్ మెతక వైఖరితోనే కిందిస్థాయి అధికారులు, సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

లైంగిక వేధింపుల కేసులో రిమాండ్

కారంచేడు: కోడలిని లైంగికంగా వేధించిన కేసులో మామకు కోర్టు రిమాండ్ విధించింది. ఎస్ఐ ఎం అనిత వివరాల మేరకు.. మండల కేంద్రం కారంచేడు రామాలయ బజారుకు చెందిన రాయనీడి సీతారామయ్య తన కోడలిని లైంగికంగా వేధిస్తుండటంతో కోడలు ఎస్పీ స్పందనలో ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదుతో ఇంకొల్లు సీఐ సూర్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో ముద్దాయిగా ఉన్న సీతారామయ్యను సోమవారం అరెస్ట్ చేసి పర్చూరు కోర్టుకు హాజరుపరచగా ఈ నెల 20వ తేదీ వరకు కోర్టు రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

శాంతి భద్రతల పరిరక్షణలో ఏఆర్ సిబ్బంది కీలక పాత్ర

● డీమొబిలైజేషన్ ముగింపు సభలో ఎస్పీ మలికా గర్గ్



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు టౌన్: బందోబస్తు నుంచి శాంతి భద్రతల వరకు ఏఆర్ పోలీసులు కీలకపాత్ర పోషిస్తున్నారని ఎస్పీ మలికా గర్గ్ ప్రశంసించారు. జనవరి 19 నుంచి ఈనెల 6 వరకు నిర్వహించిన డీమొబిలైజేషన్ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్పీ గౌరవ వందనాన్ని స్వీకరించారు. విధుల్లో ఫిట్‌నెస్‌ను మెరుగుపరుచుకునేందుకు ఏటా మొబిలైజేషన్ కార్యక్రమాన్ని నిర్వమించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఏఆర్ సిబ్బంది సంక్షేమం కోసం అనేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కోఆపరేటివ్ సొసైటీల ద్వారా పొందే రుణాన్ని రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచినట్లు వెల్లడించారు. ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తూ మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నామని, గ్రీవెన్స్ డేను సద్వినియోగం చేసుకోవడం ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. మారుతున్న కాలానికి అణుగుణంగా వృత్తి నైపుణ్యాలను పెంచుకోవాలని, శారీరక దృఢత్వానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పోలీసు శాఖ ప్రతిష్ట పెరిగేలా సాయుధ దళాల పనితీరు ఉండాలన్నారు. మొబిలైజేషన్ కార్యక్రమాన్ని క్రమశిక్షణగా నిర్వహించిన ఆర్ఐ శ్రీహరి రెడ్డిని అభినందించారు. అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఎస్పీ (క్రైమ్) ఎస్వీ శ్రీధర్‌రావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, ఐసీసీఆర్ ఇన్‌స్పెక్టర్ కేవీ రాఘవేంద్ర, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ దేవప్రభాకర్, ఆర్ఐ శ్రీహరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో రూ.17.90 లక్షల టోకరా



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మలికా గర్గ్

● ఎస్పీ వద్ద గోడు వెళ్లబోసుకున్న అన్నదమ్ములు
● పోలీస్ స్పందనకు 88 ఫిర్యాదులు
● బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ మలికా గర్గ్ ఆదేశం

ఒంగోలు టౌన్: ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ తమ అన్నదమ్ములతోపాటు మరో నలుగురి నుంచి రూ.17.90 లక్షలను ఒంగోలులోని వెంకటేశ్వర కాలనీకి చెందిన వ్యక్తి వసూలు చేసి, మోసం చేశాడంటూ చెర్లోపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి ఒకరు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మలికా గర్గ్‌కు ఫిర్యాదు చేశాడు. ఉద్యోగాలు ఇప్పించకపోవడంతో తాము ఇచ్చిన డబ్బును తిరిగి చెల్లించాలని అడిగితే ఇబ్బంది పెడుతున్నాడని వాపోయాడు. అలాగే కందుకూరుకు చెందిన ఆటో కన్సల్టెన్సీ అండ్ మొబైల్ ఫైనాన్సింగ్ సంస్థ నిర్వాహకులు అధిక వడ్డీ చెల్లించాలని వేధిస్తున్నారని సింగరాయకొండకు చెందిన మధుసూధనరావు అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు. రూ.2.36 లక్షల విలువైన సెకండ్ హ్యాండ్ ఆటోను రూ.36 వేలు డౌన్ పేమెంట్ కట్టి కొనుగోలు చేశామని, నెలకు రూ.9,870 చొప్పున రూ.2.41 లక్షలు చెల్లించిన తర్వాత అదనంగా మరో రూ.1.63 లక్షలు చెల్లించకుంటే ఆటోను స్వాధీనం చేసుకుంటామని బెదిరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా స్పందనలో మొత్తం 88 ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడిన ఎస్పీ పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయా ఫిర్యాదులపై చట్టపరంగా విచారించి పరిష్కరిస్తామని బాధితులకు భరోసా కల్పించారు. బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని జిల్లాలోని పోలీస్ అధికారులను ఆదేశించారు. అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, అడిషనల్ ఎస్పీ (క్రైమ్) ఎస్వీ శ్రీధర్ రావు, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, డీటీసీ డీఎస్పీ రామకృష్ణ, ఐసీసీఆర్ ఇన్‌స్పెక్టర్ కె.రాఘవేంద్ర, ప్యానల్ అడ్వకేట్ బీవీ శివ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రకాశంభవనంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. తొలుత ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో జనవరిలో ప్రతిభ కనపరిచిన ఆకవీడు వైద్యాధికారి జి.కరుణ, పీసీపల్లి వైద్యాధికారి నాగరాజు లక్ష్మి, తాళ్లూరు వైద్యులు హనుమానాయక్, బొట్లగుడూరు వైద్యులు హరిబాబు, తాళ్లూరు విఠలాపురం వైద్యులు డాక్టర్ షేక్ ఖాదర్ మస్తాన్‌బీలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. బీపీ, సుగర్, నాన్ కమ్యూనల్, రిజిస్ట్రేషన్ రోగులకు రెగ్యులర్ చెకప్‌లు నిర్వహించాలన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద చికిత్స పొంది డిశ్చార్జ్ అయిన రోగుల ఆరోగ్య పరిస్థితిపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

హెచ్‌ఐవీ రోగులకు హెపటైటిస్-బి వ్యాక్సిన్

ఒంగోలు అర్బన్: జిల్లాలోని మూడు ఏఆర్‌టీ కేంద్రాల్లో సోమవారం హెచ్‌ఐవీ బాధితులకు ఉచితంగా హెపటైటిస్-బి వ్యాక్సిన్ అందిస్తున్నారు. ఒంగోలు జీజీహెచ్‌లోని ఏఆర్‌టీ సెంటర్‌లో జిల్లా ఎయిడ్స్ నివారణ అధికారి డి.సురేష్, మార్కాపురంలో సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి, చీరాల్లో శేషుకుమార్ వ్యాక్సినేషన్ ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎయిడ్స్ నియంత్రణ అధికారి మాట్లాడుతూ.. హెచ్‌ఐవీ బాధితులు ఈ వ్యాక్సిన్ చేయించుకోవడం వల్ల కాలేయ సంబంధిత వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. మూడు కేంద్రాల్లో సోమవారం 175 మందికి వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వ్యాక్సిన్ వేస్తామని పేర్కొన్నారు.

క్రీడాకారులకు కలెక్టర్, ఎస్పీ అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు అర్బన్/టౌన్: రాష్ట్ర స్థాయి పవర్‌లిఫ్ట్, వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. జనవరి 30 నుంచి ఈ నెల 3వ తేదీ వరకు కృష్ణా జిల్లా జగ్గయ్యపేటలో ఏపీ స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బిట్రగుంట కేజీబీవీ విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. అండర్-17 విభాగంలో ఓవరాల్ టీమ్ చాంపియన్‌షిప్ రన్నర్స్, అండర్-19 విభాగంలో వెయిట్ లిఫ్టింగ్ ఓవరాల్ టీమ్ చాంపియన్‌షిప్ రన్నర్స్‌గా నిలిచారు. దీంతో పాటు జిల్లాకు 14 బంగారు, 4 వెండి, 4 రజత పతకాలను విద్యార్థులు సాధించారు. వీరు సోమవారం స్పందన భవనంలో కలెక్టర్ దినేష్‌కుమార్‌ను, జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఎస్పీ మలికాగర్గ్‌ను కలిశారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని, అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో రాణించాలని కలెక్టర్, ఎస్పీ ఆకాంక్షించారు. కోచ్ జి.భక్తధృవుడు, పీఈటీ హెప్సిబా, ప్రిన్సిపాల్ ఎన్.స్రవంతిని అభినందించారు. డీఈఓ విజయభాస్కర్, ఏపీఓ మాధవీలత, స్టెప్ సీఈఓ బాబురావు, క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ రాజరాజేశ్వరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైస్ మిల్లుపై విజిలెన్స్ అధికారుల దాడి

● 360 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



పద్మావతి రైస్‌మిల్లులో సీజ్ చేసిన రేషన్ బియ్యంతో విజిలెన్స్ అధికారులు

కొండపి: స్థానిక పాదిలి రోడ్డులోని పద్మావతి రైస్ మిల్లుపై సోమవారం ఒంగోలు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడి చేశారు. బయట నుంచి మిల్లులోకి వస్తున్న 50 బస్తాల రేషన్ బియ్యంతోపాటు అప్పటికే మిల్లులోకి చేర్చి గోతాలకు ఎత్తి ఉంచిన 310 బస్తాల రేషన్ బియ్యాన్ని అధికారులు సీజ్ చేశారు. మిల్లు యజమానిపై కేసు నమోదు చేసి, సింగరాయకొండ ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు రేషన్ బియ్యాన్ని తరలించారు. బియ్యంతోపాటు మిల్లులో దొరికిన కాటా, స్టిచ్చింగ్ మిషన్ తదితర వస్తువులను కొండపి పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. అక్రమంగా రేషన్ బియ్యం వ్యాపారం చేస్తున్న వంకాయలపాటి అశోక్‌తోపాటు అతనికి సహకరిస్తున్న ట్రక్కు డ్రైవర్ చెన్నయ్య మీద కేసు నమోదు చేసినట్లు ఈడీటీ రామకృష్ణ, విజిలెన్స్ సీఐ సుబ్బారావు తెలిపారు. కాగా గత కొన్ని నెలలుగా పద్మావతి ట్రేడింగ్ రైస్ మిల్లుని అడ్డాగా చేసుకుని వ్యాపారం చేస్తున్నట్లు వచ్చిన పక్కా సమాచారం మేరకు విజిలెన్స్ అధికారులు దాడి చేసినట్లు తెలుస్తోంది. ఆరు నెలల క్రితం టంగుటూరు తహసీల్దార్ చిరంజీవి సైతం ఇదే రైస్ మిల్లుపై దాడి చేసి రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. దాడుల్లో విజిలెన్స్ డీఎస్పీ అశోక్‌వర్ధన్‌రెడ్డితోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్జాతీయ తైక్వాండో పోటీలకు దర్శి బాలిక



శైలజను అభినందిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

దర్శి: దర్శికి చెందిన మాడపాకుల శైలజ అంతర్జాతీయ తైక్వాండో పోటీలకు ఎంపికైంది. జనవరి 27 నుంచి 29వ తేదీ వరకు బెంగళూరులో నిర్వహించన నేషనల్ జూనియర్ తైక్వాండో పోటీల్లో బంగారు పతకం సాధించిన ఆమెను కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించి దేశానికి పేరుతీసుకురావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. శైలజ తెనాలిలో వైష్ణవి జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. తండి బ్రహ్మయ్య దర్శిలో చిరు వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. శైలజను డీఈఓ విజయ్‌కుమార్, ఎస్‌డీఓ రాజేశ్వరి, కోచ్ కేవీజీ కీర్తి, సీనియర్ ఉపాధ్యాయులు హనుమంతరావు, వీరయ్య అభినందించారు.

పేద విద్యార్థులకు అండగా సీఎం జగన్



అశోక్‌బాబుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న గిరిప్రసాద్

పొన్నలూరు: గ్రామీణ ప్రాంతాల్లో చదువుకుంటూ ప్రతిభ ఉన్నప్పటికీ పేదరికం వల్ల ఉన్నత విద్యకు దూరమైన విద్యార్థుల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విదేశీ విద్యా దీవెన పథకాన్ని ప్రవేశపెట్టి అండగా నిలుస్తున్నారని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విదేశీ విద్యా దీవెన పథకానికి ఎంపికై అమెరికాలోని న్యూయార్క్ యూనివర్సిటీలో కంప్యూటర్ ఇంజినీరింగ్ చదివే అవకాశం పొందిన మండలంలోని రావుకొల్లు గ్రామానికి చెందిన బెల్లం గిరిప్రసాద్ సోమవారం అశోక్‌బాబును కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ.. రాష్ట్ర చరిత్రలోనే విద్యా వ్యవస్థలో వినూత్న, విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. గిరిప్రసాద్ మాట్లాడుతూ.. వ్యవసాయ పనులు చేసుకుంటూ చదువుకుంటున్న తనకు విదేశీ విద్యను అభ్యసించడానికి సహాయం అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. కార్యక్రమంలో నల్లూరి వెంకట్రావు, దద్దాళి మల్లికార్జున పాల్గొన్నారు.

త్రైక్లాన్ జాతీయ పోటీలకు మార్కాపురం విద్యార్థి



మణికంఠను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

మార్కాపురం టౌన్: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి బత్తుల మణికంఠ త్రైక్లాన్(60 మీటర్ల రన్నింగ్, బ్రాడ్ జంప్, 600 మీటర్ల పరుగు పందెం) అండర్-14 విభాగంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మణికంఠను హెచ్ఎం మునగాల చంద్రశేఖర్‌రెడ్డి అభినందించారు. ఈ నెల 10, 11వ తేదీల్లో బిహార్ రాజధాని పాట్నాలో నిర్వహించనున్న పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఫిజికల్ డైరెక్టర్ సోమశేఖర్‌రెడ్డి, టి.వెంకటేశ్వర్లు, ఇన్చార్జి ఎస్.వెంకటేశ్వర్లు, విజయ్ కుమార్, పిన్నిక ప్రసాద్, సమీవుల్లా తదితరులు అభినందించారు.